ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్, నంద్యాల గేట్, ఎస్‌పీజీ కాంపౌండ్, విద్యానగర్ ప్రాంతాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఏ పథకం కావాలన్నా.. వలంటీరుకు తెలియజేస్తే వారే దరఖాస్తు చేస్తారని, లేదా సమీపంలోని వార్డు సచివాలయానికి వెళ్లి తగిన ధ్రువపత్రాలు అందజేస్తే సరిపోతుందని చెప్పారు. అవినీతికి తావు లేకుండా జగనన్న పాలన సాగుతోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే తనకు ఇంటికి వచ్చిన వలంటీర్ పింఛన్ అందజేయడంపై గాంధీ నగర్‌కు చెందిన వృద్ధుడు వెంకటయ్య ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఎమ్మెల్యే ఆగ్రహం

కర్నూలు (టౌన్) : నగరంలోని గాంధీనగర్ పక్కన ఉన్న నంద్యాల గేట్ వద్ద నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలం ఆక్రమణకు గురికావడంపై కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడప కార్యక్రమంలో భాగంగా ఆ ఏరియాకు వెళ్లిన ఎమ్మెల్యే దృష్టికి మున్సిపల్ స్థలం ఆక్రమణ విషయాన్ని స్థానికులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందించారు. స్థలాన్ని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు ఆదేశించారు.

క్లుప్తంగా

టీడీపీ కుట్రలను తిప్పి కొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలకు మంచి చేసే ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక తన కార్యాలయంలో 45, 46, 47 వార్డుల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూర్చుతున్న మంచిని ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మళ్లీ గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకురాలు విజయ మనోహరి, నాయకులు, పాల్గొన్నారు.

ఎర్రమట్టి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : కర్నూలు మండలం దేవమడలో కౌశిక్ అనే వ్యక్తి రెండు లారీల్లో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తుండగా శనివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కౌశిక్ తన తల్లి పేరు మీద 5 వేల క్యూబిక్ మీటర్లు మట్టిని తవ్వుకోవడానికి అనుమతి పొందాడు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మట్టిని తవ్వి తరలించాడు. సమాచారం అందడంతో అధికారులు తనిఖీ చేసి కొలత వేయగా 33 వేల క్యూబిక్ మీటర్లు అక్రమంగా తవ్వినట్లు తేలింది. దీంతో ఆ వ్యక్తికి షోకాజ్ నోటీసు జారీ చేసి రూ.1.8 లక్షలు జరిమానా విధించినట్లు డీడీ తెలిపారు.

దుకాణాల్లో విస్తృత తనిఖీలు



సిగరెట్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పీఎం పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): పాత బస్టాండ్ ప్రాంతంలోని పలు దుకాణాల్లో ఆదివారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం పది దుకాణాల్లో తనిఖీ చేయగా రెండింటిలో అనుమతి లేని సిగరెట్ ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మిగతా వాటిలో ముగింపు తేదీ అయిపోయిన వస్తువులు, సరుకులు అమ్ముతుండడంతో మరోసారి ఇది పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని దుకాణ యజమానులకు హెచ్చరించారు. అనుమతి లేని సిగరెట్లు (స్మగ్లింగ్ సిగరెట్లు) విక్రయిస్తున్న షాపు యాజమానులపై రెండు కేసులు నమోదు చేసి రూ.10 వేలు జరిమానా విధించామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ కుమార్ తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కర్నూలు (రూరల్) : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో కేకే భవనంలో కురువ వెంకటరాముడు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ నారాయణ మాట్లాడుతూ బకాయి బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన సచివాలయాల ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, హుసేనయ్య పాల్గొన్నారు.

అధిక ఫీజులు నియంత్రించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా ఐక్య వేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు జీఓ నంబర్లు 53, 54లను విడుదల చేసిందన్నారు. ఈ జీఓల ప్రకారం ఆరు నుంచి పదో తరగతి వరకు పంచాయతీల్లో 12 వేలు, మునిసిపాలిటీల్లో 15 వేలు, కార్పొరేషన్లలో 18 వేలు వసూలు చేయాలని ఉన్నా క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కొందరు అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలకు తొత్తులుగా మారి అధిక ఫీజులు వసూలుచేసేందుకు సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శేషమ్మ, కర్రెమ్మ, నాగమ్మ, నారాయణమ్మ, శంకరమ్మ, లచ్చమ్మ, మేరీ పాల్గొన్నారు.

ఈ రోజు

కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ల నియామకాలకు ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూల నిర్వహించనున్నారు. ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. నగరంలోని 133 సచివాలయాల పరిధిలో 24 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం 170 మంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

స్పోర్ట్స్

తైక్వాండోలో రాణించాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రాంగోపాల్‌రెడ్డి

కర్నూలు (రూరల్) : విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణించాలని డాక్టర్ సి.రాంగోపాల్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రజ్ఞా జూనియర్ కాలేజీలో తైక్వాండో పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణకు దోహదపడుతుందని, నిరంతర సాధన ద్వారా నైపుణ్యం మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు వెంకటేశ్వర్లు, సర్దార్ ఖాన్, జలాల్ బాషా, సురేంద్ర, ఇబ్రహీం, నాగన్న పాల్గొన్నారు.

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్

కర్నూలు(రూరల్): విద్యార్థులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. నగరంలోని కిడ్స్ వరల్డ్‌లోని యోగా హాల్‌లో ఆదివారం జిల్లా స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కర్నూలు జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈపోటీలను టీజీ వెంకటేష్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఇష్టమైన క్రీడల్లో సాధన చేయాలన్నారు. అనంతరం పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, రగ్బీ సంఘం కోశాధికారి సురేంద్ర, అధ్యక్షుడు కోల ప్రతాప్, వేణుగోపాల్, చిన్న సుంకన్న, చిట్టి బాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భగవద్గీత మానవ జీవనానికి దిక్సూచి

కర్నూలు కల్చరల్: భగవద్గీత మానవ జీవనానికి దిక్సూచి అని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. జీవన ఉన్నతికి ఉత్తమ జీవన విధానానికి ఇది ఉపయోగ పడుతుందన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

3న గురుపూర్ణిమ వేడుకలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయంలో జూలై 3వ తేదీన గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి మహాబలేష్ తెలిపారు. సాయి భక్తులందరూ వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భక్తి శ్రద్ధలతో భాను సప్తమి వేడుకలు



సూర్య భగవానునికి హారతి ఇస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భాను సప్తమిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా సూర్య స్ఫటికాలకు అభిషేకం చేశారు. సూర్య నమస్కారాలు, అరుణ పారాయణం నిర్వహించారు. సూర్య భగవానునికి ప్రీతికర అరుణ హోమం చేశారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం



సమావేశంలో ఫ్యాప్టో సంఘాల నాయకులు

కర్నూలు సిటీ: ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) సాధనే తమ లక్ష్యమని ఫ్యాప్టో నాయకులు అన్నారు. ఆదివారం ఫ్యాప్టో జిల్లా కమిటీ చైర్మెన్ ఎస్.గోకారి అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సులో రాష్ట్ర కమిటీ కో-చైర్మెన్ కె.ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. జీపీఎస్ విధానం అమలుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, దీనిని తాము అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను తీర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఇందుకు అన్ని వర్గాల ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారన్నారు. సమావేశంలో ఫ్యాప్టో సభ్య సంఘాలు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు, సుధాకర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, ఏపీటీఎఫ్(257) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగన్న, శివయ్య, ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం, ఏపీ హెచ్‌ఎంల సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రె క్రిష్ణ, గట్టు తిమ్మప్ప, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తేనే సాయిబాబా, వివిధ సంఘాల నంద్యాల, కర్నూలు జిల్లా విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రతి రూపాలు సాంఘిక నాటికలు



సాంఘిక నాటికలో ఓ సన్నివేశం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: జీవన ప్రతి రూపాలు సాంఘిక నాటికలని వక్తలు అన్నారు. టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే సాంఘిక నాటికల ప్రదర్శనలో భాగంగా సీక్యాంప్ కళాక్షేత్రంలో రెండు సాంఘిక నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, సీనియర్ దర్శకులు కొల్లా రాధాకృష్ణ, జట్టి హరిబాబు మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో కళలు, కళాకారుల పాత్ర ఎంతో ఉందన్నారు. వీటిని ఆదరించి ప్రోత్సహించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించేందుకు టీజీవీ కళాక్షేత్రంలో క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి 'మనిషి మంచోడే', 'పాశం' నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. అంతకు ముందు కళాకారులను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ ర చయిత పల్లేటి కులశేఖర్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు ఇనాయతుల్లా, రాముడు, పాల్గొన్నారు.

అవీ-ఇవీ

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

కర్నూలు (టౌన్) : మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, ఆగడాలను నిలువరించాలని కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కన్వీనర్ బాను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక స్టాంటన్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి సుధీర్, జయపాల్, విజయ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు (రూరల్): కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో కేకే భవనంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిషోర్, సుజాత, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు (రూరల్) : నగరంలో జగన్నాథ గట్టుపై ఉన్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని జూలై 10వ తేదీన కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని బంగారుపేటలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా పేద ప్రజల బతుకులు మారడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, నాగరాజు, గిరి, పార్వతి, నీలిమ, జానకమ్మ, లక్ష్మి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు (రూరల్): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వినోద్ సూచించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ నగర్ సుందరయ్య భవన్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ మాట్లాడుతూ బీపీ, షుగర్, పక్షవాతం, మూర్ఛ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు జాగ్రతగా ఉండాలని, వైద్యుల పర్యవేక్షణలో తగ్గిన మందులను వాడి నడక, కొద్దిపాటి వ్యాయమం చేయాలన్నారు.

ధ్యానంతో మానసిక ఏకాగ్రత

కర్నూలు కల్చరల్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎస్టేట్‌లోని బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 'ధ్యానం ఆత్మ జ్ఞానం' పేరుతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. బుద్ధ పిరమిడ్ వ్యవస్థాపకులు బీవీ రెడ్డి.. మాస్టర్ నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి ప్రసంగించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణలో పాల్గొనడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం సహాయకులు రామ్మోహన్ రాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా బస్సులు నడపాలి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా బస్సులు నడపాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. ఆదివారం ఆయన డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ పెట్టింది పేరని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. చెయ్యి ఎత్తిన చెట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు కోరిన చోట దింపాలని, అప్పుడు ప్రయాణికుల మన్ననలు పొందగలుగుతామని సూచించారు.

వృద్ధులను ఆదరించాలి

కర్నూలు(హాస్పిటల్): వృద్ధులను ఆదరించాలని, వారి సంక్షేమం మనందరి బాధ్యత అని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ఆదివారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని సద్గురు దత్త పాలిక్లినిక్‌లో నిరుపేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న హబీబుల్లా, మైనార్టీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మైనారిటీ సలహాదారు హబీబుల్లా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కర్నూలు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైనారిటీల సమావేశంలో మాట్లాడారు. మైనారిటీల సంక్షేమానికి నాడు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఉన్నత విద్యకు రిజర్వేషన్లు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. చదువుకునేందుకు ఇబ్బంది పడకూడదని ఎస్సీ, ఎస్టీ, బీసీలతో సమానంగా మైనార్టీలకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీ యింబర్స్‌మెంట్ అందజేశారన్నారు. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తూ మరింత మేలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మైనారిటీలను పట్టించుకోలేదన్నారు. అందుకే మైనారిటీలు 2019 ఎన్నికల్లో ఓటుతో ఆయనకు తగిన బుద్ధి చెప్పారన్నారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్ఆర్.. హమ్ సబ్ జగన్‌కు సాథ్ అనే పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను నిర్మించాలి

కర్నూలు (రూరల్) : జిల్లా సాగునీటి అవసరాల కోసం గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కేకే భవన్‌లో సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు లేక నిరుద్యోగులు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో సరైన సాగునీటి సౌకర్యం లేక రైతులు గుంటూరు లాంటి ప్రాంతాలకు కుటుంబంతో కలసి వలస వెళ్తున్నారన్నారు. ఎగువన అప్పర్ భద్ర నిర్మాణం చేస్తే జిల్లా ఎడారిగా మారుతుందని, దీనిని అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రాముడు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఆమె గృహమే.. ఓ వనం!

- ఇంటి తోటలో రాణిస్తున్న ఉమాదేవి
- 500 కుపైగా మొక్కల పెంపకం
- ఆకుకూరలు, కూరగాయలు, అన్ని రకాల పండ్లు, పూల మొక్కలు



మొక్కలకు నీరు పోస్తున్న ఉమాదేవి



ఇంటి ఆవరణలో వివిధ రకాల పండ్లు,పూల మొక్కలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో అనేక మంది మహిళలు తమ ఇళ్లను పచ్చదనంతో నింపుకుంటున్నారు. ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరుచునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎలాంటి రసాయనాలు లేని కూరగాయలు, ఆకు కూరలు, పూలు ఇంటి దగ్గరే పండించుకునేందుకు మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారిలో డాక్టర్ ఉమాదేవి ఒకరు. ఈమె ఇంటిని గార్డెన్‌గా మార్చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు బి.క్యాంపు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఉమాదేవి సిల్వర్ జుబ్లీ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. ఉన్నత విద్యావంతురాలైన ఈ మహిళ తమ ఇంటిని పచ్చదనానికి నిలయంగా మార్చుకున్నారు.ఆరున్నర సెంట్లలో ఉన్న ఇంటి చుట్టూ రకరకాల మొక్కలు పెంచి అందంగా తయారు చేసుకున్నారు. రోజూ మొక్కల సంరక్షణ, నీళ్లు కట్టడం, ఎరువులు వేయడం తదితర పనులకు దాదాపు 2 గంటల సమయం వెచ్చిస్తున్నారు.

అన్ని రకాల మొక్కలు

విశ్రాంత ప్రిన్స్‌పాల్ ఉమాదేవి పదేళ్లుగా పచ్చదనం అభివృద్ధే లక్ష్యంగా రాణిస్తుండటం విశేషం. దాదాపు 500 మొక్కలతో ఆమె ఇంటికి కొత్త కళను తెచ్చుకున్నారు. మొక్కల సంరక్షణలో ఉమాదేవికి ఆమె భర్త, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పుల్లయ్య కూడా సహకరిస్తున్నారు. ఇంటి ఆవరణలోనే సపోట, మామిడి, నేరేడు, జామ, సీతాఫలం, స్టార్‌ఫ్రూట్, గజ నిమ్మ, నిమ్మ పండ్ల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. మందారంలో 15 రకాల మొక్కలు అలరిస్తున్నాయి. 25 రకాల క్రోటన్స్, 5 రకాల మనీప్లాంట్స్, అన్ని రకాల పూల మొక్కలు, ఆకు కూరలు, కూరగాయల మొక్కలు, తమలపాకు, కరివేపాకు మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు కూడా ఉండటం విశేషం. ఇవన్నీ పెద్ద బకెట్‌లు, కుండీల్లో నాటి పెంచుతున్నారు.

కెమికల్స్‌కు తావు లేకుండా...

ఇంటితోట అభివృద్ధికి ఎలాంటి కెమికల్స్ వాడటం లేదు. 100 శాతం సేంద్రియ ఎరువులనే వినియోగిస్తున్నారు. వంటి గదిలో ఉత్పన్నమయ్యే వ్యర్థాలు, చెట్ల ఆకులు, ఇతర వర్థ్యాలను కంపోస్టు ఎరువుగా మార్చి మొక్కలకు వినియోగిస్తున్నారు. వర్మీకంపోస్ట్ ఎరువును కూడా చెట్లకు వాడుతున్నారు. పోషకాలు, ఖనిజాలు కలిగిన సేంద్రియ ఎరువులు వాడుతుండటం ద్వారా మొక్కల్లో ఎదుగుదల ఎక్కువగా ఉండటం విశేషం. తగిన మోతాదులో నీళ్లు, ఎరువులు, ఉష్ణోగ్రతలు అందుతుండటం వల్ల చీడపీడల బెడద కూడా లేదు. దీంతో బి.క్యాంపు హౌసింగ్ బోర్డు కాలనీలోని పలు ఇళ్లలో పూజా కార్యక్రమాల సమయంలో ఉమాదేవి ఇంటిలో పండుతున్న పూలనే వినియోగిస్తున్నారు. ఇంటి అవసరాలకు తగిన ఆకు కూరలు, కూరగాయలు కూడా ఇంటితోటలోనే పండుతున్నాయి.

మొక్కల సంరక్షణ హాబీగా మారింది

మొక్కల సంరక్షణ, పచ్చదనం అభివృద్ధి మాకు ప్రత్యేక హాబీగా మారింది. పదేళ్లుగా ఇంటితోటను అభివృద్ధి చేసుకొని ప్రతి రోజు ఇందులో వివిధ పనులు చేస్తూ రెండుగంటల సమయం గడుపుతాము. మొక్కల సంరక్షణకు భర్త కూడా సహకరిస్తున్నారు. ఎలాంటి కెమికల్స్ వాడము. కిచెన్‌లో ఉత్పన్నమయ్యే వ్యర్థాలు, మొక్కల ఎండటాకులను కంపోస్ట్ ఎరువుగా మార్చి మొక్కలకు వాడుతున్నాము. అనేక రకాల మొక్కలు ఉన్నప్పటికీ ఇంకా కొత్తకొత్త మొక్కలు తెచ్చి మరింత అభివృద్ధి చేసుకోవాలని ఉంది.

-ఉమాదేవి, విశ్రాంత ప్రిన్స్‌పాల్